# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

శనివారం 5-8-2023




## పది వేలకే మెడికల్ సీటు

ఎక్కువ మంది డాక్టర్లు తయారవుతున్న రాష్ట్రం తెలంగాణ

అసెంబ్లీలో వైద్యశాఖ మంత్రి హరీష్‌రావు

**హైదరాబాద్, ఆగస్ట్5(తెలుగుప్రభ):**

ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసేందుకు రాష్ట్రప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై దాదాపు రూ.30 లక్షలు ఖర్చు చేస్తోంది. అలాగే పీజీ విద్యకు రూ.45 లక్షలు, సూపర్‌స్పెషాలిటీ కోర్సుకు రూ.75 లక్షలు ఖర్చు చేస్తోంది. ఈ వివరాల్ని అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా వైద్యశాఖ మంత్రి హరీష్‌రావు తెలిపారు. సభ్యులు గ్యాదరి కిశోర్, డా. సంజయ్, డా.ఆనంద్, అక్బరుద్దీన్‌ల ప్రశ్నలకు సమాధానంగా మంత్రి ఈ వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ హరీష్‌రావు, ఒకప్పుడు రాష్ట్రంలోని విద్యార్థులు వైద్యవిద్య నభ్యసించాలంటే పొరుగు రాష్ట్రాలకో, ఉక్రెయిన్, రష్యా, చైనా వంటి దేశాలకో వెళ్లేందుకు ఎంతో వ్యయప్రయాసలు పడేవారన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజ్ ఏర్పాటుచేయడం వల్ల విద్యార్థులకు ఇప్పుడు ఇక్కడే చదువుకునే సదుపాయం లభించిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జిల్లాకో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైతం ఉండేది కాదని, రాజధాని నగరాన్ని ఆనుకుని ఉన్న రంగారెడ్డి జిల్లాలో సైతం అప్పట్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడాన్ని ప్రస్తావించారు. తెలంగాణ వచ్చాక, వైద్యరంగం విప్లవాన్ని సృష్టించిందన్నారు. ధాన్యం ఉత్పత్తిలో నెంబర్ వన్ మాదిరిగానే ఎక్కువ మంది డాక్టర్లను తయారు చేస్తున్న రాష్ట్రంగా కూడా త్వరలోనే నెంబర్ వన్ కానుందన్నారు. ఈసంవత్సరం దేశవ్యాప్తంగా కొత్త ఎంబీబీఎస్ సీట్లు 2200 వస్తే, అందులో 900 సీట్లు తెలంగాణలోనే వచ్చాయన్నారు. దేశంలోని మొత్తం ఎంబీబీఎస్ సీట్లలో 43 శాతం సీట్లు సాధించుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే పీజీసీట్లు రెండున్నరరెట్లు, సూపర్‌స్పెషాలిటీ సీట్లు రెండు రెట్లు పెరిగాయన్నారు. లక్ష జనాభాకు 8 ఎంబీబీఎస్ సీట్లతో రాష్ట్రం రెండో స్థానంలో ఉందని తెలిపారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీ పెట్టాలంటే వంద సీట్లకు రూ. 300 కోట్లు, నూటాయాభై సీట్లకు రూ.500 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఇంత వ్యయమవుతున్నా రాష్ట్రంలో ప్రతిభ గల విద్యార్థులు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు పొందితే కేవలం రూ.10వేల ఫీజు మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు.

## రేపటి వరకు 'అసెంబ్లీ'

**హైదరాబాద్, ఆగస్ట్5(తెలుగుప్రభ):**

రాష్ట్ర శాసనసభ సమావేశాలు రేపు కూడా జరగనున్నాయి. రేపటివరకు నిర్వహించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆదివారం అసెంబ్లీ నుద్దేశించి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ప్రసంగించనున్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత గడచిన తొమ్మిదేళ్లలో రాష్ట్రం సాధించిన అభివృద్ధి, కొనసాగుతున్న ప్రగతి గురించి వివరించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

# రాజ్‌భవన్ వద్ద రగడ

## ఆర్టీసీ కార్మికుల ఆందోళన





ఆర్టీసీ కార్మికుల ఆందోళన

చలో రాజ్‌భవన్

– ఉదయం నుంచే నిరసనలు




**హైదరాబాద్, ఆగస్ట్5(తెలుగుప్రభ):**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి సంబంధించిన బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపనందుకు నిరసనగా తెలంగాణ మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు కార్మికులు రాజ్‌భవన్ ముట్టడికి ప్రయత్నించారు. పీవీమార్గ్, అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా బయల్దేరారు. పోలీసులు భారీ బందోబస్తుతో బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాటిని తోసుకొని వెళ్లి రాజ్‌భవన్ ఎదుట బైఠాయించారు. మరోవైపు, ఆర్టీసీ కార్మికులను చర్చలకు రావాల్సిందిగా గవర్నర్ తమిళిసై ఆహ్వానించారు. కార్మికుల భద్రత, భవిష్యత్ ప్రయోజనాల రక్షణ కోసమే తాను బిల్లుపై సంతకం చేయలేదని పేర్కొన్నారు. ఐదు అంశాలపై తనకు క్లారిటీ కావాలన్నారు.

### ఉదయం నుంచే నిరసనలు


శనివారం ఉదయం నుంచే ఆర్టీసీ కార్మికులు విధులను బహిష్కరించి నిరసనలు ప్రదర్శించారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు వారు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రెండు గంటల నిరసనే అని పేర్కొన్నప్పటికీ, చాలా ప్రాంతాల్లో ఆతర్వాత కూడా నిరసన జరిపారు. పరిమిత సంఖ్యలో కొన్ని బస్సులు మాత్రమే రోడ్డెక్కాయి. నగరంలో ఉప్పల్, చెంగిచెర్ల, హయత్‌నగర్, ఫలక్‌నుమా, హకీంపేట, లింగంపల్లి, హెచ్‌సీయూ, కూకట్‌పల్లి తదితర డిపోల్లో కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తమకు ప్రయోజనం కలిగించే బిల్లుపై గవర్నర్ సంతకం చేసి ఆమోదం తెలపాలని వారు కోరారు. ఈ అంశంపై గవర్నర్ తక్షణం స్పందించాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఆర్టీసీ కార్మికులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. బిల్లుపై వివరణ పేరుతో గవర్నర్ ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు 45 వేల కుటుంబాల జీవితాలతో ఆడుకోవద్దని యూనియన్ నేతలు కోరారు. బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు లేకుండా గవర్నర్ వ్యవహరించాలన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా ఆమోదించకపోతే తమకు అన్యాయం జరుగుతుందన్నారు. మానవతా దృక్పథంతో గవర్నర్ బిల్లును ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.

### సంతకం చేస్తా.. గవర్నర్

ఆర్టీసీ సిబ్బంది ఆందోళనపై గవర్నర్ తమిళి సై స్పందించారు. పుదుచ్చేరిలో ఉన్న ఆమె కార్మిక సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కార్మికులకు తాను వ్యతిరేకం కాదని, కొన్ని సందేహాల నివృత్తి కోసం ప్రయత్నిస్తున్నాని చెప్పారు. అయితే.. గవర్నర్ తో సమావేశానికి కేవలం టీఎంసీని మాత్రమే అనుమతి ఇవ్వడంపై మిగతా సంఘాలు ఎన్ఎంయు, టీజేఎన్సీ అభ్యంతరం వ్యక్తం చేశాయి. విలీనంపై సానుకూలంగా ఉన్నట్లు గవర్నర్ తమతో చెప్పారని సమావేశం అనంతరం ఆర్టీసీ నేతలు తెలిపారు. ప్రభుత్వం నుంచి సమాధానాలు రాగానే సంతకం చేస్తానని గవర్నర్ చెప్పినట్లు పేర్కొన్నారు.

### ఇబ్బందులు పడ్డ విద్యార్థులు

బస్సులు నడవక పోవడంతో స్కూళ్లు, కాలేజీలకు వెళ్లాల్సిన విద్యార్థులు, గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకిసంబంధించిన పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేందుకు అభ్యర్థులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన ఉద్యోగులు బస్సులబంద్ కారణంగా ఇబ్బందులు పడ్డారు.



## రాహుల్‌కు బిహార్ మటన్

– వండి వడ్డించిన లాలూ

**న్యూఢిల్లీ, ఆగస్ట్5(తెలుగుప్రభ):**

మోదీ ఇంటిపేరుకు సంబంధించిన వివాదంపై పరువునష్టం కేసులో సూరత్ కోర్టు విధించిన రెండేళ్ల శిక్షపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రీయ జనతాదళ్ నేత లాలూప్రసాద్‌యాదవ్ శుక్రవారం రాత్రి ప్రత్యేక విందుకు ఆహ్వానించారు. హాజరైన రాహుల్‌కు బీహార్ స్పెషల్ చంపారన్ మటన్ తెప్పించి స్వయంగా తానే వండి వడ్డించారు. రాహుల్ గాంధీ రాగానే బొకే ఇచ్చి అభినందించి ఆలింగనం చేసుకున్న లాలూ అనంతరం ఆయనతో కాసేపు మాట్లాడారు. ఇద్దరూ కొద్దిసేపు రాజకీయాల గురించి ముచ్చటించుకున్నారు. ఇటీవల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న లాలూ యాదవ్ ఆరోగ్యం మెరుగై రాజకీయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

## ఘనంగా స్వాతంత్ర్య వజ్రోత్సవాలు

**హైదరాబాద్, ఆగస్ట్5(తెలుగుప్రభ):**

స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి తెలిపారు. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఆదేశాల కనుగుణంగా స్వతంత్ర భారత వజ్రోత్సవాల వేడుకల ముగింపు ఉత్సవాల నిర్వహణపై సీఎస్ ఉన్నతస్థాయి అధికారులతో సమీక్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవాలకు సంబంధించి నిర్వహించాల్సిన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వవిభాగాల అధికారులు కృషి చేయాలన్నారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, యువజనులు, విద్యార్థులతో పాటు భిన్నరంగాలకు చెందిన ప్రజలను భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వజ్రోత్సవ ప్లాంటేషన్ పేరిట కోటి మొక్కలు నాటాలనేది సీఎం లక్ష్యమన్నారు. కోటి 15 లక్షల జాతీయ పతాకాలను ప్రజలకు పంపిణీ చేయడంతోపాటు రాష్ట్రంలోని అన్ని సినిమాహాళ్లలో మహాత్మాగాంధీ సినిమాను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, జంక్షన్లు, చారిత్రక భవనాలను ప్రత్యేక లైటింగ్‌తో అలంకరించనున్నట్లు చెప్పారు. వజ్రోత్సవాల గురించి విద్యాసంస్థల్లో వ్యాసరచన, డిబేట్, పెయింటింగ్, తదితర పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని తెలియజేసే విధంగా హైదరాబాద్‌లో ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల తేదీలు, పూర్తి వివరాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఖరారు చేయనున్నారని చెప్పారు. సమావేశంలో రాష్ట్రప్రభుత్వ సలహాదారు రమణాచారి, పీసీసీఎఫ్ డోబ్రియల్, జీఏడీ కార్యదర్శి శేషాద్రి, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి శైలజా రామయ్యర్, టీఎస్ఐఐసీ ఎండి ఈవీ నర్సింహారెడ్డి, సమాచారశాఖ ప్రత్యేక కార్యదర్శి అశోక్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల కోసమే ప్రభుత్వం

బీఆర్ఎస్‌కే సాధ్యం

నోటరీ స్థలాల క్రమబద్ధీకరణతో

మరో సంచలనం



**హైదరాబాద్, ఆగస్ట్5(తెలుగుప్రభ):**

మరోమారు రైతులకు రుణమాఫీ చర్యలతోనే రాష్ట్రంలోని ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలకు దిమ్మతిరిగేలా చేసిన ప్రజాపక్ష బీఆర్ఎస్ ప్రభుత్వం నోటరీ పత్రాల స్థలాలను క్రమబద్ధీకరించేందుకు తీసుకున్న నిర్ణయం వారి గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. మేం అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం అని ప్రగల్భాలు పలుకుతున్న ప్రతిపక్షాలు అసలు హామీలిచ్చేందుకు తమకు ఏం మిగిలి ఉన్నాయా అని ఓవైపు తలలు బద్దలు కొట్టుకుంటుండగానే,మరోవైపు ప్రజలేం కోరుకుంటున్నారో, వారు వేటి వల్ల ఇబ్బందులు పడుతున్నారో ప్రజలతో కలిసిపోయిన ప్రభుత్వానికి తెలుసు కనుక వారి సమస్యలు పరిష్కరించే నిర్ణయాలు ఒక్కటొక్కటిగా తీసుకుంటోంది. రెండు రోజుల క్రితమే ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో జీవో –118 ద్వారా 18వేల కుటుంబాలకు ప్రయోజనం కలిగించేలా వారి ఇళ్లను క్రమబద్ధీకరిస్తూ మునిసిపల్ మంత్రి కేటీఆర్ పట్టాలు పంపిణీ చేశారు.సంబంధిత భూముల్లో నివసిస్తున్న వారు ఇళ్లు కట్టుకోకున్నా,వారికి సైతం త్వరలోనే పట్టాలిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు సికింద్రాబాద్ జీరా ప్రాంతంలో 1934 నుంచి లీజుస్థలాల్లోని ఇళ్లలో ఉంటున్నవారికి తమ ఇళ్లు శిథిలావస్థకు చేరి కూలే ప్రమాదంలో ఉన్నా హక్కులు లేవంటూ పునర్నిర్మాణానికి అధికారులు అంగీకరించలేదు.వారి పరిస్థితిని స్థానిక శాసనసభ్యుడు, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మునిసిపల్ మంత్రి కేటీఆర్ దష్టికి తీసుకువెళ్లడంతో వారి ఇళ్లు ఫ్రీ హోల్ చేస్తూ జీఓ–74 జారీ చేయించారు.దశాబ్దాల వారి కల అలా తీరింది.

### లక్షల కుటుంబాలకు పండగ

చిరు, మధ్యతరగతి జీవులు కాస్త తక్కువ ధరకు భూమి లభిస్తుందంటే నోటరీ పత్రాల ద్వారానే కొనుక్కున్నారు. చెమటోడ్చి పైసాపైసా కూడబెట్టిన సొమ్ముతో కొనుక్కున్న స్థలంలోనే ఇల్లు కట్టుకున్నా ఎన్నెన్నో సమస్యలు. భూమి ఉండి లేనట్లు..ఇల్లు ఉండీ తమది కానట్టు బతుకుతున్నారు.రాష్ట్రంలో, ముఖ్యంగా నగరంలోని పలు శివార్లలో ఇలాంటి కుటుంబాలు లక్షల్లో ఉన్నాయి. దశాబ్దాలుగా వారనుభవిస్తున్న వేదనను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ వాటి క్రమబద్ధీకరణ నిర్ణయం తీసుకోవడంతో వారి కళ్లల్లో కాంతులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే జీవో 58, 59ల కింద లక్షల కుటుంబాలకు నివసించే హక్కు అమలు చేసిన ప్రభుత్వంగా బీఆర్ఎస్ ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకుంది.

### హాయిగా నిద్దుర పోవచ్చు

అయ్యప్ప సొసైటీలో బడా బాబుల జోలికి పోని బల్దియా అధికారులు గోకుల్‌ప్లాట్స్‌లో ఇళ్లు కొనుక్కున్న మాపై జులుం చెలాయించే వారు. వారికి ఎప్పుడు డబ్బు కావాలంటే అప్పుడు మామీద పడి కూల్చేస్తామని బెదిరించేవారు. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని నిద్రలేకుండా గడిపిన రాత్రులెన్నో. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా మాలాంటి మధ్య తరగతి వారికి తగిన హక్కు లభిస్తుందని ఆశిస్తున్నా. ఎన్నో ఏళ్లుగా మొత్తుకుంటున్నా ఎవరూ పట్టించుకోని లక్షలాది కుటుంబాల సమస్యల్ని పరిష్కరించే వారి కంటే గొప్ప పాలకులెవరుంటారు.

– ప్రసాదరావు, కూకట్‌పల్లి

## మణిపూర్‌లో మళ్లీ హింస.. ముగ్గురి మృతి..

**మణిపూర్, ఆగస్ట్5 (తెలుగుప్రభ)**

జాతుల మధ్య వైరంతో అట్టుడుకుతోన్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. బిష్ణుపూర్ జిల్లాలోని క్వాక్టాలోకి అర్ధరాత్రి చొరబడ్డ దుండగులు కాల్పులకు తెగబడ్డారు. మిలిటెంట్ల దాడిలో ముగ్గురు మృతి చెందారు. దీంతో హింస చెలరేగి భద్రతా బలగాలు, ఆందోళనకారుల మధ్య భీకర కాల్పులు జరిగాయి. మృతులు మైతేయి వర్గానికి చెందిన వారిగా సమాచారం. గ్రామంలో తమ ఇళ్లకు కాపలాగా ఉన్న సమయంలో గ్రామస్తులపై మిలిటెంట్లు విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో తండ్రి, కుమారుడితో సహా మరో వ్యక్తి చనిపోయారు. కాల్పుల్లో మణిపూర్ కమాండో ఒకరు గాయపడినట్లు తెలుస్తోంది. దీంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు.

